

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 47 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 17, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# జర్నలిస్టుల అణిచివేతే జవాబుదారి తనమా










**జర్నలిస్టుల చిత్తశుద్ధిని శంకిస్తున్నారు జాగ్రత్త**
**ప్రతి ఒక్కరూ జర్నలిస్టులపై విరుచుకుపడుతున్నారు**
**సమాజాన్ని మేల్కొల్పే జర్నలిస్టులపై ఇంత కక్ష ఎందుకు**
**సీపి సజ్జనర్ మీ ఉడకదంపుడు బెదిరింపులకు భయపడే జర్నలిస్టులం కాదు**
**పైస సంపాదన లేని వర్కింగ్ జర్నలిస్టులపై పగబడుతున్నారు**
**వర్కింగ్ జర్నలిస్టులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుంది**
**ప్రభుత్వాలకు ప్రభుత్వ అధికారులకు మాత్రమే మనోభావాలు ఉంటాయా**
**అబద్దాలకు ఆదర్శ మూర్తులందరూ నిజాయితీపరు లైపోతున్నారు**
**రాష్ట్ర జర్నలిస్టు సంక్షేమం అభివృద్ధి అనేది ఉత్త మాటేనా**
**దేశంలో కేంద్ర ప్రభుత్వంపై జరుగుతున్న వ్యతిరేక పోరాటం**
**ఏంటో రాష్ట్రాప్రభుత్వానికి కనిపించడం లేదా**
**జర్నలిస్టులను కావాలని అణచివేస్తే ప్రభుత్వానికి జరిగే మేలేమిటి**
**ఎవరి మీద కోపం ఎవరి మీద తీస్తున్నారు : డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

జర్నలిస్టుల ఓపికను పరీక్షించకండంటూ డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్నది ఎవరో పాటిస్తున్నది ఏమిటో తెలంగాణ ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టుల చిత్తశుద్ధిని శంకిస్తున్నారు అంటూ తీవ్రంగా మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్టీవీ జర్నలిస్టులపై పెట్టినటువంటి అక్రమ కేసుల పట్ల హైదరాబాద్ సీపి సజ్జనార్ విరుచుకుపడుతూ చట్టాలను అమలు పరుస్తాం తట్టుకోగలరా మీరందరు ఎక్కడ ఉంటారో తెలుసా అంటూ పత్రిక ముఖంగా బెదిరించడం అధికార దిగులుజారుడుతనానికి నిదర్శనంగా ఉందన్నారు.ఇంత సీనియర్ ఐపీఎస్ అధికారిగా పేరుగాంచిన సీపి సజ్జనార్ జర్నలిస్టులను అణిచివేస్తూ బెదిరించడం అంటే "దిశా" ఎన్కౌంటర్ కేసులో కావలసినంత వ్యక్తిగత పేరు ప్రఖ్యాతలు సంపాదించి చివరకు చిన్న స్థాయి ఉద్యోగులను కేసులో ఇరికించి శిక్షపడేలా చేసి తప్పించుకున్నట్లా అంటూ నిలదీశారు.ఏ.... ఐఏఎస్ అధికారైన ఏ.... ఐపీఎస్ అధికారైన వార్తా ప్రసారాలపై వార్తా కథనాలపై కేసులు కట్టే హక్కు

- మిగతా 2లో..

## మోదీని అందుకే కలుస్తున్నా: రేవంత్ రెడ్డి

రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి

బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి

ప్రజలు అండగా ఉంటే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తానన్న సీఎం



2

## హైదరాబాద్‌లో పోలీసులపై దాడి

చైతన్యపురి పీఎస్ పరిధిలో ఘటన

తన కారు అద్దం పగలగొట్టారంటూ పోలీసులకు కిరీటి అనే వ్యక్తి ఫిర్యాదు

అక్కడకు వెళ్లిన పోలీసులపై నిందితుడి దాడి



2

## నాచారంలో మద్యం మత్తులో అన్నను హతమార్చిన తమ్ముడు

7

### ఈ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం యావత్ తెలంగాణకు గర్వకారణం: కేటీఆర్

టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందన్న కేటీఆర్

ఈ విధానం ద్వారా రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

పదేళ్లలో 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని స్పష్టీకరణ

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దని ప్రత్యర్థులకు హితవు

రైతుబంధు, మిషన్ భగీరథలాగే టీఎస్ ఐపాస్‌కు జాతీయ గుర్తింపు లభించిందని వ్యాఖ్య



7



## ప్రారంభమైన సంక్రాంతి తిరుగు ప్రయాణాలు

ఏపీలో ప్రధాన బస్టాండ్లలో పెరిగిన రద్దీ

ముగిసిన మూడు రోజుల సంక్రాంతి సంబరాలు

సొంతూళ్ల నుంచి నగరాలకు ప్రజల తిరుగు ప్రయాణం

ఏపీ వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిట

రద్దీని తగ్గించేందుకు ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు

సోమవారం వరకు ప్రయాణికుల రద్దీ కొనసాగే అవకాశం

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# జర్నలిస్టుల అణిచివేతే "జవాబుదారి" తనమా

మొదటి పేజీ తరువాయి

లేదనేది సుప్రీంకోర్టు ఉత్తర్వులను క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఎవడు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి జీవిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. సిట్ ఉన్నదే విచారించడానికి అని పదేపదే పలుకుతున్న అధికారులకు ప్రభుత్వ నాయకుల ప్రోత్బలంతో బలవంతపు పరోక్షపు కేసు కట్టడం చట్టానికి పూర్తి విరుద్ధమైన సంగతి ఎందుకు మరిచిపోయారంటూ నిలదీశారు.ఎన్టీవీ ప్రతినిధులు ప్రచురించిన కథనాలలోని మహిళా ఐఏఎస్ అధికారిని రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘానికి గాని ప్రభుత్వానికి గాని ఏ ఇతరత్రా అధికారులకు గాని తన మనోభావాలు దెబ్బతింటున్నట్లుగా తనపైనే ఇలాంటి కథనాలు వస్తున్నాయని ఎక్కడ గాని అర్జీ పెట్టుకున్న దాఖలాలు లేనప్పుడు ఐఏఎస్ అధికారుల సంఘం పరోక్షంగా మనోభావాలు దెబ్బతింటున్నాయంటూ వినతి పత్రం పెట్టడం కేసు కట్టించడం ఎంతటి దుర్మార్గమో సిపి సజ్జనార్ కు ఎందుకు అర్థం కావడం లేదన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పదేపదే మాటతప్పుతున్న ప్రభుత్వంపై ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయి అంటూ సుమోటో కేసు పెట్టగల సత్తా సిపి సజ్జనార్ కు ఉందా అంటూ నిలదీశారు.పోలీస్ అధికారులు ఎంతోమంది అక్రమ సంబంధాల కేసులో ఇరుక్కొని కనీసపు కనివిడుపు చర్యలు కూడా అనుభవించకుండా తిరిగి ఉద్యోగంలో కొనసాగడం లేదా అంటూ వాళ్లందరినీ సీపి సజ్జనార్ ఒక్కసారి గుర్తుకు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పరిధిలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఫేక్ న్యూస్,ఫ్రాడ్ న్యూస్, బేస్లెస్ న్యూస్,ఆధారాలు లేకుండా మహిళలను శంకిస్తున్నారని జర్నలిస్టుల భరతం పడతామంటూ తీవ్రవాదులను దోపిడిదారులను అంతర్జాతీయ దొంగలను,సైబర్ నేరగాళ్లను విచారించే సిసిఎస్ లాంటి సంస్థకు జర్నలిస్టుల విచారణ కేసును అప్పగించడం సీపి సజ్జనార్ అతిక తెలివికి నిదర్శనంగా మారిపోయిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో2025 మొదలుకొని 2026 వరకు హైదరాబాద్ పోలీస్ అధికారులు అక్రమంగా కట్టిన కేసులు సుమారుగా లక్షకు పైన న్యాయస్థానాల్లో మూలుగుతున్నాయని వాటిపై సిపి సజ్జనార్ పత్రికా సమావేశం నిర్వహించి ఏం బదిలీస్తారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.జర్నలిస్టులు అంటే ఆషామాసిగా ఉందనుకుంటున్నారా అంటూ హెచ్చరించారు.ఎవడు పడితే వాడు సోషల్ మీడియాలో జర్నలిస్టులపై వికృతంగా మాట్లాడుతున్నారని వివిధ రాజకీయ పార్టీలకు అంటగడుతున్నారని వాటన్నిటిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు.ఎర్రి లేసిన కుక్కలతో(రాజకీయ పార్టీల వ్యక్తులు) మొరిగిస్తే భయపడతాం అనుకోవడం అవివేకం లాంటిది అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అధికారులకు నాయకులకు ప్రత్యేకమైన చట్టాలు ఏమైనా ఉన్నాయా అంటూ సీపి సజ్జనార్ తెలుపాలన్నారు.బరాబర్ కేసులు పెడతాం కోర్టుకు సమర్పిస్తాం అంటూ జబర్దస్త్ గా మాట్లాడుతున్న సీపి సజ్జనార్ సుప్రీంకోర్టు నియమాలు ఏం చెప్తున్నాయో ఒక్కసారి చదువుకుంటే బాగుంటుందని గుర్తు చేశారు.జర్నలిస్టులపై పరోక్షపు కేసులు కట్టడమే సిగ్గుమాలినతనమని అవివేకం అని అవి న్యాయస్థానాల్లో ఏమాత్రం నిలబడవని సాక్షాత్తు సుప్రీంకోర్టు స్పష్టంగా ఉత్తర్వులు వెలువరిచగా కొంతమంది ఐఏఎస్ అధికారులకు కొంతమంది ఐపీఎస్ అధికారులకు సుప్రీంకోర్టు నియమాలు పట్టవన్నట్లుగా కేవలం జర్నలిస్టులపై మాత్రమే కేసులు కడతామంటే చట్టం మీకేమైనా చుట్టమా అంటూ నిలదీశారు.సమాజంపై మీకన్నా ఎక్కువ బాధ్యతతో ఎక్కువ క్రమశిక్షణతో ఎక్కువ చిత్తశుద్ధితో ఎక్కువ శ్రమల అనుభవిస్తూ ఎక్కువ మానసిక దాడులు ఎదుర్కొంటూ లెక్కలేనని ఆర్థికపరమైన బాధలను అనుభవిస్తూ జర్నలిజం చేయడం అంటే మామూలు అనుకుంటున్నారా అంటూ గుర్తు చేశారు.మీకు... మీకు... రాజకీయపరంగా సవాలక్ష గొడవలు ఉండొచ్చు గాక ప్రజాక్షేత్రంలో అందరికీ సమాన హక్కులు ఉన్నప్పుడు అక్రమ సంబంధాల కేసులో ఇరుక్కుంటున్న పోలీస్ అధికారులకు మినహాయింపు ఎందుకు లభిస్తుందో సీపి సజ్జనార్ బహిరంగంగా తెలపాలన్నారు.చట్టము అమలుపరిస్తే ఎలా ఉంటుందో చూస్తారా అంటూ బెదిరిస్తున్న సీపి సజ్జనార్ చట్టాలకు న్యాయస్థానాలకు ఎవరు అతీతులు కాలేరన్న సంగతిని మర్చిపోవద్దన్నారు.అధికారం ఉంది కదా అని చట్టాలకు విరుద్ధంగా సుప్రీంకోర్టు నియమాలకు విరుద్ధంగా ఎలా పడితే అలా కేసులు పెట్టి అణిచివేస్తూ బెదిరిస్తామంటే సహించేది లేదన్నారు.జర్నలిస్టు సమాజంతో పెట్టుకునే తాకదు ఎవరికీ లేదన్నారు.సుప్రీంకోర్టు నియమాలకు విరుద్ధంగా కేసులు కడితే బలయ్యేది అధికార యంత్రాంగమే అన్నారు.మీకు కాదు కదా మీ బాబుకు కూడా భయపడే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు.జర్నలిస్టులను అణిచివేయడం మీ తరం కాదు కదా ఎవరి బాబు తరం కాదన్నారు.క్రిమినల్ కేసులలో అక్రమ ఆస్తుల కేసులలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఇరుక్కుంటున్న అధికారుల పరిస్థితి ఎందుకు వెల్లడించలేకపోతున్నారన్నారుతప్పుడు కేసులు బనాయిస్తూ సామాన్యుల ప్రాణాలు తీస్తున్న కేసులలో ఎంతో మంది పోలీస్ అధికారులు చాకచక్యాన్ని ప్రదర్శిస్తూ తప్పించుకు తిరుగుతున్నారని వాళ్ళందరి సంగతేందంటూ సిపి సజ్జనారే పత్రికా ముఖంగా తెలంగాణ సమాజానికి తెలియజేయాలన్నారు.మీ కమీషనరేట్ పరిధిలోని జరుగుతున్న నేరాలు-ఘోరాలపై దృష్టి పెట్టకుండా జర్నలిస్టులపై కేసు కట్టి రాష్ట్రమంతా గొప్పోల్లైపోతాం అనుకుంటే అది మీ భ్రమ అన్నారు.అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలాగా వ్యవహరించడం ఇకనైనా మానుకోవాలని తెలిపారు.ప్రజాసేవ చేయడానికి చేతగాక జర్నలిస్టులపై పగబడుతున్నారంటూ తీవ్రంగా హెచ్చరించారు. సిపి సజ్జనార్ మీకు చాతనైతే అక్రమ వ్యాపారస్తుల,భూ కబ్జాదారుల,గంజాయి డ్రగ్స్ మాఫియా,సైబర్ నేరగాళ్ల భరతం పట్టడం అంటూ సవాల్ విసిరారు.మహిళా ఐఏఎస్ అధికారిని మంత్రికి సంబంధించిన సిడిఆర్ రికార్డులను వాట్సాప్ సంభాషణ రికార్డులను బయట పెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టు పరిధిలోనికి రాని అక్రమ కేసులు లెక్కకు మించి కలవని వాటిని ఏమంటారో సిపి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.అదువగా దొరికామని జర్నలిస్టులను ఆడుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.ప్రజాస్వామ్యం మీ ఒక్కరిది కాదు యావత్ తెలంగాణ ప్రజలదంటూ అందులో జర్నలిస్టులు రాజ్యాంగం కల్పించిన హక్కులలో భాగంగా మాత్రమే కథనాలను ప్రచురిస్తారని వాటిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ తీవ్రవాదుల్లాగా చిత్రీకరిస్తాం అనుకుంటే చివరకు ఇరుక్కుపోయేది అధికారులేనంటూ గుర్తు చేశారు.జర్నలిస్టులతో పెట్టుకొని ప్రభుత్వాలే నిలువలేకపోయాయని గుర్తిస్తే బాగుంటుందన్నారు.ప్రభుత్వ సహకారం అధికార హోదా అడ్డం పెట్టుకొని అక్రమంగా కేసులు గట్టి బలవంతంగా అరెస్టులు చేస్తామంటే పరిస్థితులపై వరుస కథనాలతో జర్నలిస్టులు అంతా ఏకమై పోరాటం చేయగలరు సుమి జాగ్రత్త అంటూ గుర్తు చేశారు.

# హైదరాబాద్‌లో పోలీసులపై దాడి

**చైతన్యపురి పీఎస్ పరిధిలో ఘటన**
**తన కారు అద్దం పగలగొట్టారంటూ పోలీసులకు కిరీటి అనే వ్యక్తి ఫిర్యాదు**
**అక్కడకు వెళ్లిన పోలీసులపై నిందితుడి దాడి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి పోలీసులపైనే దాడికి పాల్పడ్డాడు. నిన్న రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తన కారు అద్దం పగలగొట్టారంటూ కిరీటి అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఘటనా స్థలికి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ వెళ్లారు. కారు అద్దం పగలగొట్టిన నిందితుడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో, పోలీసులపై కూడా నిందితుడు దాడికి పాల్పడ్డాడు. తన బట్టలు విప్పేసి, పోలీసులపై దాడి చేస్తూ హంగామా సృష్టించాడు. స్థానికులు అడ్డుకోబోయినప్పుడు వారిని కూడా బెదిరించాడు... పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మోదీని అందుకే కలుస్తున్నా: రేవంత్ రెడ్డి

**రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నానన్న రేవంత్ రెడ్డి**
**బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి**
**ప్రజలు అండగా ఉంటే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తానన్న సీఎం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమేనని, కానీ ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామని, సాధ్యమైనంత వరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. మోదీ తనకు వ్యక్తిగత బంధువుకాదని, దేశ ప్రధాని కాబట్టే ప్రాంత అభివృద్ధి కోసం ఆయనను కలుస్తున్నానని తెలిపారు. ప్రాంత ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, తనకు వ్యక్తిగత పైరవీలు లేదా స్వార్థ ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు. నిర్మల్ లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ఎంతో ప్రత్యేకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ జిల్లాకు అందాల్సిన న్యాయం, జరగాల్సిన అభివృద్ధి గతంలో సరిగా జరగలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు కూడా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటివరకు విశ్వవిద్యాలయం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలోనే విశ్వవిద్యాలయానికి అధికారిక ఆమోదం వస్తుందని, బాసరలో వర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు అవసరమైన అన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. తుమ్మడి హెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని, అక్కడే ప్రాజెక్టును నిర్మించి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శిలాఫలకం వేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరు చేసినట్లే ఆదిలాబాద్‌కూ ఇస్తామని కేంద్రం చెప్పిందని సీఎం గుర్తు చేశారు. అడిగితేనే అభివృద్ధి వస్తుందని, గత పాలకులు అడగకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వారి పాలన వల్ల అప్పులు మిగిలాయని, నాడు ఇచ్చిన బియ్యం ఎవరు తిన్నారో తెలియదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం ప్రజలు తింటున్నారని అన్నారు. సున్నా వడ్డీ పేరుతో గుండు సున్నా మిగిల్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు అండగా నిలిస్తే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారినే గెలిపించాలని కోరారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి**
**మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి**
**మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర మంత్రి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.

# నియోజకవర్గానికి ఒకటి చొప్పున మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు : సీఎం రేవంత్ రెడ్డి

హైద్రాబాద్, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'ప్రాణం' అనే కొత్త పథకాన్ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ డే కేర్ సెంటర్లలో వృద్ధులకు వినోదం, ఆహ్లాదంతో పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని సీఎం వివరించారు. ఆటలు, పుస్తకాలు, విశ్రాంతి సదుపాయాలు, ఉచిత ఆహారం వంటి సౌకర్యాలతో పాటు వారానికి ఒకసారి ఉచిత వైద్య పరీక్షలు, అవసరమైన మందులు కూడా అందించనున్నట్లు తెలిపారు. వృద్ధులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సెంటర్లు ఆదివారం మరియు ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 39 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్లు ఒంటరితనం దూరమై, సమాజంతో మమేకమై గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో 'ప్రాణం' పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో వృద్ధుల జీవితాల్లో కొత్త ఉత్సాహం నింపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అన్నపూర్ణ స్టూడియోస్ లో ఘనంగా 'సంక్రాంతి అల్పాహార విందు'

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

దివంగత అక్కినేని నాగేశ్వరరావు గారు ప్రారంభించిన 'సంక్రాంతి అల్పాహార విందు'ను హైదరాబాదులోని అన్నపూర్ణ స్టూడియోస్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సంప్రదాయం 50వ వసంతంలోకి అడుగుపెట్టడం ఈ వేడుకకు మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. ఐదు దశాబ్దాల క్రితం, తన సంస్థ పురోగతికి మూలస్తంభాలైన కార్మికుల పట్ల కృతజ్ఞత చాటుకునేందుకు ఏఎన్నార్ సంక్రాంతి రోజున ఈ విందును ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఈ సంప్రదాయం అప్రతిహతంగా కొనసాగుతోంది. ఈ స్వర్ణోత్సవ వేడుక సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రాంగణాన్ని పండగ శోభ ఉట్టిపడేలా అద్భుతంగా అలంకరించారు. అయితే, ప్రతి ఏటా జరిగే ఈ కార్యక్రమానికి భిన్నంగా ఈసారి సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులను, పిల్లలను సైతం ప్రత్యేకంగా ఆహ్వానించి వేడుకను మరింత ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగార్జున ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. యజమానులమనే భావన లేకుండా, వారంతా స్వయంగా సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు అల్పాహారాన్ని వడ్డించారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.

# నిజాం ఒక హంతకుడు: ధర్మపురి అర్వింద్

**నిజాం పేరును నిజామాబాద్ కు ఎందుకు పెట్టుకుంటారన్న అర్వింద్**
**నిజామాబాద్ ను ఇందూర్ గా పిలవాలని డిమాండ్**
**నిజాం ఎప్పటికీ దుర్మార్గుడిగానే మిగిలిపోతాడని వ్యాఖ్య**



నిజామాబాద్, జై భీమ్ న్యూస్

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన... శ్రీరాముడికీ బీజేపీ మెంబర్‌షిప్ ఉందని, అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను ఉద్దేశించి అన్నారు. నిజామాబాద్‌ను 'ఇందూర్ణగా పిలవాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. నిజాం ఒక హంతకుడని, అలాంటి వ్యక్తి పేరును నిజామాబాద్ కు ఎందుకు పెట్టుకుంటారని అన్నారు. ఇందూర్ అనే పేరు ఎలా వచ్చిందన్న దానిపై చారిత్రక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ పేరు మార్చి ఇందూర్‌గా చేయాలని తీర్మానం చేసి, ఏబీవీపీ నుంచి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి పంపిస్తామని తెలిపారు. ముస్లింలంటే కాంగ్రెస్ అన్నట్టు మాట్లాడటం సరికాదని విమర్శించారు. పహల్గాం ఘటనను ప్రస్తావిస్తూ... అక్కడ హిందువులా, ముస్లింలా అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. కొంతమంది హిందువుల్లో కూడా చెడు ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ మొత్తం త్వరలో కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో తెలుసుకోవాలంటే కవితను అడిగితే చెబుతుందని ఎద్దేవా చేశారు. రేపు సిరిసిల్లలో కూడా బీజేపీ బలాన్ని చూపిస్తామని చెప్పారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే మత ఘర్షణలు జరిగాయని అర్వింద్ ఆరోపించారు. చెన్నారెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో అల్లర్లు జరిగాయని తెలిపారు. అప్పట్లో ఏసీపీ సత్తయ్య హత్య కేసులో నిందితులను బయటకు తీసుకొచ్చింది మజ్లిస్ పార్టీయేనని ఆరోపించారు. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని, దీనికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని విమర్శించారు. నిజాంను గాడిద అని అన్నందుకే రాద్ధాంతం చేస్తున్నారని, కానీ చరిత్రలో నిజాం ఎప్పటికీ దుర్మార్గమైన రాజుగానే మిగిలిపోతాడని అన్నారు. ఆయన పేరు వినగానే హిందువులకు గుర్తొచ్చేది ఆయన చేసిన మారణకాండేనని పేర్కొన్నారు. ముస్లింలకు ఇళ్లు, రేషన్, ఉచిత వ్యాక్సినేషన్ మోదీ ప్రభుత్వం ఇస్తోందని... ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపించిందని తెలిపారు.

# రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత

## ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి




**హసన్‌పర్తి, 16 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఎరైవ్ ఎలైవ్ ప్రచారంలో భాగంగా హసన్‌పర్తి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలీసులు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పింగిలి ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బందికి రోడ్డు భద్రతపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి విస్తృతంగా మాట్లాడుతూ, రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు అతివేగం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని నిర్లక్ష్యం చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి తప్పిదాల వల్ల అనేక విలువైన ప్రాణాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు చట్ట భయంతో కాకుండా మన భద్రత కోసం పాటించాలని, చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారిస్తాయని స్పష్టం చేశారు. "రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత" అని ఆయన తెలిపారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ చేరాలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరుగుతున్న ప్రాణాంతక ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరిగితే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఏపీఓ సునీత, ఎస్ఐ రవితో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతోనే ఎరైవ్ ఎలైవ్ ప్రచార లక్ష్యం సాధ్యమవుతుందని పోలీసులు పేర్కొన్నారు.

# తెలంగాణలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణ తేదీలు ఖరారు

### ఒక్కో సర్పంచ్‌పై రూ.5,000 ఖర్చు - జనవరి 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తరగతులు

**హైద్రాబాద్, 16 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు సమగ్ర అవగాహన కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ స్థాయిలో పారదర్శక పాలన, సమర్థవంతమైన అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టి జి.ఐ.ఆర్.డి) ఆధ్వర్యంలో ఈ శిక్షణలు నిర్వహించనున్నారు. జనవరి 19 నుంచి 21 వరకు జిల్లాల వారీగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల విధులు, అధికారాలు, బాధ్యతలు, నిధుల వినియోగం, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పంచాయతీరాజ్ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. సర్పంచ్‌లు తమ విధులను సమర్థంగా నిర్వర్తించేందుకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా రూపొందించిన కరదీపికను కూడా అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,760 మంది సర్పంచ్‌లు ఈ శిక్షణ పొందనున్నారు. జిల్లాల వారీగా సర్పంచ్‌లను ఐదు బ్యాచ్‌లుగా విభజించి, ఒక్కో బ్యాచ్‌కు 5 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రతి బ్యాచ్‌లో కనీసం 50 మంది సర్పంచ్‌లు పాల్గొంటారు. శిక్షణ సమయంలో బస, భోజనం, శిక్షణా నిర్వహణ ఖర్చుల కోసం ఒక్కో సర్పంచ్‌పై రూ.5,000 వరకు ప్రభుత్వం వ్యయం చేయనుంది. ఈ శిక్షణా కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేందుకు 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారికి ఇప్పటికే టీజీఐఆర్డీలో ప్రత్యేక ఓరియంటేషన్ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మాస్టర్ ట్రైనర్లు పాలన, గ్రామాభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, ప్రజాసేవ వంటి కీలక అంశాలపై సర్పంచ్‌లకు లోతైన శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా ఉపయోగపడే కరదీపికను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించిన విషయం తెలిసిందే. పంచాయతీరాజ్ చట్టం--2018 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలపై సమగ్ర సమాచారంతో 292 పేజీలతో ఈ పుస్తకాన్ని టీజీఐఆర్డీ రూపొందించింది. మొత్తంగా ఈ శిక్షణా కార్యక్రమాలు గ్రామ స్థాయిలో మంచి పాలనకు, ప్రజాప్రతినిధుల్లో నైపుణ్యాభివృద్ధికి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.




# ధరణి-భూభారతి రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి





### రూ.3.90 కోట్ల కుంభకోణం - 15 మంది అరెస్టు, మరో 9 మంది పరారీ

**జనగామ/యాదాద్రి, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ధరణి--భూభారతి రిజిస్ట్రేషన్లలో జరిగిన భారీ కుంభకోణాన్ని జనగామ పోలీసులు ఛేదించారు. జనగామ, యాదాద్రి జిల్లాలకు సంబంధించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన రూ.3.90 కోట్ల కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన ముఠాకు చెందిన 15 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, మరో 9 మంది పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో నిందితుల నుంచి పోలీసులు రూ.63.19 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.1 లక్ష, సుమారు రూ.1 కోటి విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో యాదాద్రి జిల్లాకు చెందిన పసునూరి బసవరాజు (32), జెల్లా పాండు (46), మహేశ్వరం గణేష్ కుమార్ (39)తో పాటు, జనగామ జిల్లాకు చెందిన ఈగజులపాటి శ్రీనాథ్ (35), యెనగంధుల వెంకటేష్, కోదురి శ్రావణ్ (35), కొలిపాక సతీష్ కుమార్ (36 -- కొడకండ్ల మండలం), తడూరి రంజిత్ కుమార్ (39 -- నర్మెట్ట) ఉన్నారు. అదేవిధంగా దుంపల కిషన్ రెడ్డి (29 -- ఆత్మకూర్ మండలం), దశరథ మేఘావత్ (28 -- తురుపల్లి), నారా భాను ప్రసాద్ (30 -- యాదగిరిగుట్ట), గొపగాను శ్రీనాథ్ (32), ఒగ్గు కర్నాకర్ (42), కమల్ల శివ కుమార్ (33 -- అమంగల్, నల్లగొండ జిల్లా), అలేటి నాగరాజు (32)లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టులపై వివరాలను సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు యాదాద్రి--భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ప్రాంతంలో ఆన్‌లైన్ సర్వీస్ కేంద్రాలు నిర్వహిస్తూ ఈ మోసాలకు పాల్పడ్డారు. నిందితుల్లో గణేష్ అనే వ్యక్తి రైతుల నుంచి ధరణి--భూభారతి రిజిస్ట్రేషన్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఎన్‌ఆర్ఐ ఖాతా ద్వారా చెల్లిస్తానని నమ్మించి, మీ-సేవ కేంద్రాల సిబ్బంది ద్వారా డబ్బులు వసూలు చేసి, అందులో నుంచి ఆన్‌లైన్ సర్వీస్ నిర్వాహకులు, మధ్యవర్తులకు కమిషన్ చెల్లిస్తూ మిగిలిన మొత్తాన్ని ప్రధాన నిందితులకు పంపేవాడు. వసూలు చేసిన చలాన్లను బసవరాజు ధరణి/భూభారతి వెబ్‌సైట్లలోని ఇన్స్పెక్ట్ --ఎడిట్ అప్లికేషన్‌ను దుర్వినియోగం చేస్తూ చలాన్ రుసుమును తగ్గించి, మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడని పోలీసులు తెలిపారు. ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ల సహాయంతో వెబ్‌సైట్లో జారీ అయిన రసీదులను తక్కువ మొత్తంగా మార్చి, మార్పు చేసిన నకిలీ చలాన్లను మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, వాటిని స్థానిక ఎంఆర్ఓ/రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మధ్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ ముఠా జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ-సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సర్వీసులు, మధ్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణి--భూభారతి రిజిస్ట్రేషన్ పత్రాలను తమ వద్దనే వెబ్‌సైట్లలో నమోదు చేసేది. ఇందుకు ప్రతిఫలంగా మిగతా వారికి 10 శాతం నుంచి 30 శాతం వరకు కమిషన్ చెల్లించినట్లు విచారణలో తేలింది. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాదాద్రి జిల్లాల్లో మొత్తం 1,080 పత్రాలకు సంబంధించిన లావాదేవీల్లో నిందితులు మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మొత్తం 22 కేసులు నమోదు కాగా, వాటిలో జనగామ జిల్లాలో 7, యాదాద్రి జిల్లాలో 15 కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పందరి చేతన్, జనగామ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, రఘునాథపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఎస్ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు.



# క్రమశిక్షణతో పార్టీ కోసం పని చేయండి: అరవింద్ లింబావలి



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బిజెపి కార్యకర్తలు పార్టీ ఇచ్చిన బాధ్యతను తగినంతగా నిర్వర్తించాలని మాజీ మంత్రి అరవింద్ లింబావలి సూచించారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీ ప్రకారం విభజించబడినమహాదేవపుర నగర్ మండల వార్డులకు కొత్త వార్డు అధ్యక్షులను ప్రకటించడానికి నియోజకవర్గంలోని మారతహళ్లిలోని ఒక ప్రైవేట్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎటువంటి గందరగోళం లేకుండా సంఘటితంగా వ్యవహరించి పార్టీ సూత్రాలకు కట్టుబడి పనిచేయాలి. గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను పార్టీ నిర్ణయిస్తుంది. వారు ఎన్నికల కోసం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ కలిగిన సైనికుల మాదిరిగా పార్టీ కోసం పనిచేయాలని ఆయన అన్నారు. మహదేవపుర నియోజకవర్గంలో వేలాది మంది అక్రమ బంగ్లాదేశ్ నివాసితులు నివసిస్తున్నారు. ప్రభుత్వం వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి మరియు వారు ఓటరు జాబితాలో చేర్చబడకుండా చూసుకోవాలి. ఇప్పటికే చేర్చబడిన అటువంటి వ్యక్తులను జాబితా నుండి తొలగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగా ఎన్నికైన వార్డు అధ్యక్షులను ఆయన అభినందించారు మరియు పార్టీని నిర్వహించడంలో మరియు పార్టీ యొక్క సమగ్ర అభివృద్ధిలో వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ నగర్ మండల అధ్యక్షుడు ఎన్.ఆర్. శ్రీధర రెడ్డి, మనోహర్ రెడ్డి, ఎల్. రాజేష్, కె.ఎన్. బాబురెడ్డి, నాయకులు హనుమంత గౌడ, నాగేష్ రెడ్డి, లోకేష్, లోకనాథ్, మంజునాథ్ గోపీనాథ్, వివిధ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరం మహదేవపుర నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్ మెడికవర్ హాస్పిటల్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. వైద్యులు మరియు సిబ్బంది ఐక్యతా స్ఫూర్తితో కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి భారీగా చేరిన యువత

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ సమక్షంలో పార్టీలో చేరికలు



**అంతర్గాం, 16 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై, అంతర్గాం మండలం టి.టి.యస్ గ్రామానికి చెందిన యువకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. గోదావరిఖని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అలకుంట మల్లేష్, ఎత్తరి సారయ్య, వేముల రాజ్ కుమార్, సాయి లోకిని వెంకటేష్, అలకుంట రాజయ్య, సమ్మయ్య, రాపాక శ్రీకాంత్, నాగేష్, రవీందర్, అంగోత్ తావుర్య, అలకుంట నిలయ్య, ముద్దంగుల సమ్మయ్య, ఎత్తరి రాజకుమార్ తదితరులతో పాటు సుమారు ముప్పై మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమాన్ రెడ్డి, తిరుపతి నాయక్, గోలివాడ సమ్మక్క జాతర కమిటీ చైర్మన్ గిట్ల శంకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి





**భద్రకాళి-బాసర వరకు ఆలయాల అభివృద్ధికి చర్యలు**
**కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో రూ.70 కోట్లు**

**హన్మకొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భద్రకాళి నుంచి బాసర వరకు ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా-బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు మంత్రులకు ఆశీర్వచనం అందజేశారు. అంతకుముందు త్రిశూలం కూడలిని మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ స్వామివారు భీకర రూపం కాకుండా ముఖంపై కోర మీసాలతో దర్శనమిస్తారని, అందుకే భక్తులు ఆయనను "కోర మీసాల వీరభద్ర స్వామి"గా కొలుస్తారని తెలిపారు. పురాణాల ప్రకారం తపస్సు చేసి స్వయంభువుగా స్వామివారు వెలిశారని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. కాకతీయుల కాలానికి చెందిన వేంగి చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించారని, తరువాత కాకతీయ రాజైన బేతరాజు--1 ఆలయాన్ని పునరుద్ధరించారని చరిత్ర చెబుతోందన్నారు. 1600 సంవత్సరాల ప్రాంతంలో కొండపై వంట చెరుకు కోసం వెళ్లిన కుమ్మరులకు స్వామివారు స్వప్నంలో దర్శనమిచ్చారని, అనంతరం విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారనే కథనం ప్రాచుర్యంలో ఉందన్నారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బ్రహ్మోత్సవాలు అతి వైభవంగా నిర్వహిస్తారని, లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు. స్వామివారి కళ్యాణం, కుంకుమార్చన, కోడె కట్టడం, అగ్నిగుండం, బండ్లు తిరిగే కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. సంతానం లేని వారు కోరమీసం స్వామివారికి సమర్పిస్తే సంతానం కలుగుతుందనే గాఢ విశ్వాసం భక్తుల్లో ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని, మహిళలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకున్నామని, జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలన్న సూచనలు కూడా ఇచ్చినట్లు వెల్లడించారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.70 కోట్ల నిధుల ప్రతిపాదనలు పంపారని, మాస్టర్ ప్లాన్‌తో పాటు అన్ని అనుమతులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. భద్రకాళి నుంచి బాసర వరకు ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు. వేములవాడ, భద్రకాళి ఆలయాల్లో మాడవీధుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మేడారంలో సమ్మక్క-సారలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, చారిత్రక కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఉత్తర తెలంగాణలోనే కోర మీసాల దేవుడిగా, గుమ్మడికాయల దేవుడిగా, కోరిన కోరికలు తీర్చే దేవుడిగా వీరభద్ర స్వామికి విశేష ఖ్యాతి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధిని భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా చేపడతామని స్పష్టం చేశారు. మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ రాజు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మేడారం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ధనసరి అనసూయ సీతక్క





**మేడారం, 16 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ తదితరులు మంత్రికి తోడుగా ఉన్నారు. ముఖ్య అతిథుల కోసం ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలం, టెంట్ సిటీ, సాంస్కృతిక కార్యక్రమాల సభా ప్రాంగణం, క్యూ లైన్స్ షెడ్లు, మీడియా టవర్ నిర్మాణాలు, ప్రధాన ఆర్చీ ఫ్లోరింగ్ పనులను మంత్రి సవివరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క అధికారులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు శనివారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణ పరిసరాలలో ఉన్న రాతి నిర్మాణాల వ్యర్థాలను వెంటనే తొలగించాలని, రహదారుల వెంట భక్తులకు తాగునీరు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్‌డీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఒకే ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు

**అమ్మాయిల చదువు ఎంతటి అద్భుతాలు సృష్టిస్తుందో నిరూపించిన మాకుల నర్సయ్య కుటుంబం**



**హన్మకొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

నేటి తీవ్ర పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంటే కేవలం ప్రతిభతో పాటు క్రమశిక్షణ, ఓర్పు, కుటుంబ సహకారం అవసరం. అలాంటి పరిస్థితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ కొలువులు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవడం విశేషం. హనుమకొండ జిల్లా కాజిపేట్ మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన మాకుల నర్సయ్య, లక్ష్మి దంపతుల కుమార్తెలు ఈ అరుదైన ఘనతను సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. మాకుల నర్సయ్య, లక్ష్మి దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. గ్రామీణ నేపథ్యంలో జీవిస్తూ, పరిమిత వనరుల మధ్య పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఈ దంపతుల కృషికి ఇప్పుడు తగిన ఫలితం దక్కింది. పెద్ద కుమార్తె మాకుల రజిని గతంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసి, ప్రస్తుతం కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ గృహిణిగా కొనసాగుతున్నారు. మిగిలిన ముగ్గురు కుమార్తెలు ప్రభుత్వ రంగంలో స్థిరపడటం ఈ కుటుంబానికి గర్వకారణంగా మారింది. రెండవ కుమార్తె మాకుల శ్రీలత రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలో భాగమయ్యారు. మూడవ కుమార్తె మాకుల శ్వేత తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా పనిచేస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. చిన్న కుమార్తె మాకుల సృజన ఇటీవలే ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికై ప్రభుత్వ ఉద్యోగం సాధించి కుటుంబ ఆనందాన్ని మరింత పెంచారు. ఈ విజయంపై కుమార్తెలు స్పందిస్తూ, "మేము ఈ స్థాయికి చేరుకోవడానికి మా తల్లిదండ్రులైన నర్సయ్య, లక్ష్మి ప్రోత్సాహం, త్యాగాలే ప్రధాన కారణం. చదువు విషయంలో ఎప్పుడూ రాజీ పడకుండా మాకు ధైర్యం ఇచ్చారు. అలాగే పెళ్లి తర్వాత మా భర్తలు అందించిన సహకారం, ప్రోత్సాహం వల్లే మేము చదువుపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించగలిగాం" అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అమ్మాయిల చదువుపై అనేక సందేహాలు, అడ్డంకులు ఉన్న పరిస్థితుల్లో, మాకుల నర్సయ్య కుమార్తెలు "అమ్మాయిలను చదివిస్తే కుటుంబాలే కాదు, సమాజమే ముందుకు సాగుతుంది" అనే మాటను ఆచరణలో చూపించారు. ఒకే ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు ఉండటంతో కుమ్మరిగూడెం గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. బంధుమిత్రులు, గ్రామస్తులు ఈ కుటుంబాన్ని అభినందిస్తూ, ఇతరులకు కూడా ఇది ప్రేరణగా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ విజయం కేవలం ఒక కుటుంబానికే కాదు, గ్రామీణ తెలంగాణలో అమ్మాయిల విద్యకు, వారి సాధికారతకు దిశానిర్దేశం చేసే ఉదాహరణగా నిలుస్తోంది.

## కట్రయాల శ్రీ మల్లికార్జున స్వామి జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





**వర్ధన్నపేట, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట మండలం కట్రయాల గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కట్రయాల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. జాతరలో పాల్గొన్న భక్తులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకొని, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, కట్రయాల శ్రీ మల్లికార్జున స్వామి జాతరకు విశేషమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందని, గ్రామ ప్రజలు ఐక్యతతో ఈ జాతరను ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు, భక్తుల సందడి, జాతర వాతావరణం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. కట్రయాల గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పర్యవేక్షణ నిర్వహించారు.

# వేడి సాంబారులో పడి చిన్నారి మృతి

**ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన**
**ఆడుకుంటూ వేడి సాంబారులో పడ్డ ఆరేళ్ల చిన్నారి**
**హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వేడి సాంబారు ఉన్న పాత్రలో పడి ఆరేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఈ హృదయ విదారక ఘటన వైరా మండలంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగాల సింహాద్రి, సరోజని దంపతుల కుమార్తె రమ్య శ్రీ (6) ఇంట్లో ఆడుకుంటోంది. ఆ సమయంలో వంట గది సమీపంలో పొయ్యి మీద మరుగుతున్న సాంబారు పాత్రలో అదుపుతప్పి పడిపోయింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి, తీవ్రంగా గాయపడిన బాలికను స్థానిక ఆసుపత్రికి తరలించారు. శరీరం ఎక్కువ భాగం కాలిపోవడంతో రమ్య శ్రీ పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు బాలికను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే చిన్నారి కన్నుమూసింది. ఇంట్లో ఆడుకోవాల్సిన పాప ఇలా అర్థాంతరంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో ఇందిరమ్మ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఐనవోలు నుంచి పాలకుర్తి వరకూ ప్రజల మధ్యే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





**జనగాం, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ -- జనగాం జిల్లాలు వరంగల్, జనగాం జిల్లాల్లోని ఐనవోలు, పాలకుర్తి, బొమ్మెర గ్రామాల్లో శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్న పలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దేవాలయ దర్శనాలు, జాతరల్లో పాల్గొనడం, పార్టీ కార్యక్రమాలు, ప్రజల సమస్యలపై స్పందనతో ఆయన రోజు మొత్తం ప్రజల మధ్యనే కొనసాగింది. రాజకీయ కక్షతో జరుగుతున్న దాడులపై ఆయన చేసిన ఘాటైన వ్యాఖ్యలు కూడా ఈ సందర్భంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వరంగల్ జిల్లా ఐనవోలు మండలంలో జరుగుతున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం పాలకుర్తికి చేరుకున్న మాజీ మంత్రి, ఇటీవల పాలకుర్తి మాజీ జడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్ రావు ఇంటి కాంపౌండ్ గోడను కూల్చివేసిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ నేరుగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ---అర్ధరాత్రి వందలాది పోలీసులతో వచ్చి జేసీబీలతో గోడ కూల్చడం అధికార అహంకారానికి, రాజకీయ కక్షసాధింపుకు స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలబడ్డ నాయకులపై ఈ తరహా ప్రతీకార చర్యలు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు అని, పాలకుర్తి నియోజకవర్గంలో తమకు అనుకూలంగా లేనివారి ఇళ్లను కూల్చడం ధర్మమా? అంటూ ఘాటుగా ప్రశ్నించారు. ముందుగా అధికార పార్టీ నేతలే ప్రభుత్వ భూములు కబ్జా చేసిన విషయాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిలబడుతుందని, ఇలాంటి దుర్మార్గ చర్యలను నిరంతరం ఎదిరిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఇదే రోజున జనగాం జిల్లా పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ ప్రస్థానాన్ని ప్రతిబింబించే నూతన సంవత్సర క్యాలెండర్ను ఘనంగా ఆవిష్కరించారు. "ప్రజల మధ్యే ప్రజల కోసమే" అనే భావాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ, "ఓటమి తాత్కాలికరౌ ప్రజల ప్రేమ శాశ్వతం" అంటూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జనగాం జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో నిర్వహించిన శ్రీ ఆలేటి ఎల్లమ్మ జాతరలో మాజీ మంత్రి పాల్గొని బోనమెత్తి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన రాకతో అక్కడున్న మహిళలు ఆనందంతో ఆప్యాయంగా పలకరించి కంకణం కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ జాతరలో కూడా జిల్లా, మండల, గ్రామ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయనతో కలిసి పాల్గొన్నారు. దేవాలయ దర్శనాల నుంచి రాజకీయ పోరాటాల వరకు, ప్రజా కార్యక్రమాల నుంచి వ్యక్తిగత పరామర్శల వరకు--- ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రజల మధ్యే ఉండే నాయకుడు అనే విషయం మరోసారి స్పష్టమైంది. ఐనవోలు, పాలకుర్తి, బొమ్మెర గ్రామాల్లో ఆయన పాల్గొన్న కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, ప్రజల్లో ఆయనపై ఉన్న ఆదరణను స్పష్టంగా ప్రతిబింబించాయి.

# ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకం





**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**వరంగల్, 16 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల నివారణను లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఆరైవ్.. ఆలైమ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కార్యక్రమంగా వరంగల్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో హనుమకొండ సిటీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులకు రోడ్డు భద్రతపై పోలీస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ట్రాఫిక్ పోలీస్ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, తప్పనిసరిగా పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ సమయంలో చేయకూడని పనులపై ఆర్టీసీ ఉద్యోగులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ--- దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తీవ్రమైన సమస్యగా మారాయని, వాటి కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లను విధుల్లోకి తీసుకునే ముందు పలు దశల్లో కఠిన పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికే బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని అన్నారు. ఇటీవల ఆర్టీసీకి సంబంధించిన రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని, ఇందుకు డ్రైవర్ల క్రమశిక్షణ, బాధ్యతాయుత డ్రైవింగ్ ప్రధాన కారణమని పేర్కొంటూ ఆర్టీసీ ఉద్యోగులందరినీ అభినందించారు. రాత్రి సమయాల్లో బస్సు బ్రేక్‌డౌన్ జరిగితే బస్సు వెనుక భాగంలో రెడియం స్టికర్ తప్పనిసరిగా ఉంచాలని, అలాగే రాబోయే మేడారం జాతర సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్లపై బస్సులను నిలిపివేయవద్దని డ్రైవర్లకు ఆయన ప్రత్యేకంగా సూచించారు. అనంతరం సుదీర్ఘకాలంగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఒక్క ప్రమాదం కూడా జరగకుండా సేవలందించిన డ్రైవర్లను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి డ్రైవర్ బాధ్యత కూడా అని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో ఓర్పు, అప్రమత్తతతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. అందువల్ల వేగ నియంత్రణ, ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి అలవాట్లను పూర్తిగా మానుకోవాలని ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, ఆర్టీసీ బస్సులు రహదారులపై ఇతర వాహనాలకు మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రజల్లోనూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరుగుతుందని, ముఖ్యంగా పాదచారులు, విద్యార్థులు, వృద్ధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్ మాట్లాడుతూ, ఆర్టీసీ డ్రైవర్లు సంస్థకు మాత్రమే కాకుండా సమాజానికి కూడా సేవ చేస్తున్నారని అన్నారు. పోలీస్ శాఖతో కలిసి ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా డ్రైవర్లలో మరింత బాధ్యత పెరుగుతుందని, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ ఎప్పటికప్పుడు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ధర్మంసింగ్, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ తదితర అధికారులు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవలు

**హైదరాబాద్, 16 జనవరి 2026 (జై భీమ్ న్యూస్):**

టీజీఎస్ ఆర్టీసీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకుని, వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేని భక్తుల కోసం ప్రత్యేక లాజిస్టిక్స్ సేవలను ప్రారంభించింది. ఈ సేవల ద్వారా భక్తుల ఇంటి వద్దకే బంగారం ప్రసాదాన్ని చేరవేయనున్నారు. దేవాదాయ శాఖ సహకారంతో అందించే ఈ బంగారం ప్రసాదం ప్యాకెట్లో దేవతల ఫోటోతో పాటు బెల్లం, పసుపు, కుంకుమ వంటి పూజా సామగ్రి ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీనికి గాను భక్తులు రూ.299/- చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు ఙఙఙ.స్త్రంతీఎశ్రీశీస్త్రఱర్‌ఱఎం.ఎశీ.ఱఅ వెబ్‌సైట్‌లో లేదా టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040-69440069, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మ భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ప్రత్యేక సేవలు భక్తుల నుంచి మంచి స్పందన పొందుతున్నాయి.



# అంధత్వాన్ని జయించి డాక్టరేట్ సాధించిన పరిశోధకుడు - ఎం. రాజేశ్వర్ రెడ్డి



**హన్మకొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి (అంధుడు) డా. ఎం. రాజేశ్వర్ రెడ్డి డాక్టరేట్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల అధికారికంగా డాక్టరేట్ ప్రకటించారు. డా. ఎం. రాజేశ్వర్ రెడ్డి తన పరిశోధనను "ఎన్విరాన్మెంటల్ మూవ్‌మెంట్స్ ఇన్ తెలంగాణా స్టేట్ -- ఎ కేస్ స్టడీ (ఎన్విరాన్మెంటల్ మూవ్మెంట్స్ ఇన్ తెలంగాణ స్టేట్ -- ఎ కేసు స్టడీ)" అనే అంశంపై పూర్తి చేశారు. ఈ పరిశోధనను రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి. సమ్మిలాల్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ ఉద్యమాల పుట్టుక, వాటి సామాజిక ప్రభావం, ప్రజాస్పందన వంటి అంశాలను లోతుగా విశ్లేషించిన ఈ అధ్యయనం విద్యావర్గాల్లో విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. మూలంగా భోమ్పల్లి మండలంకు చెందిన డా. ఎం. రాజేశ్వర్ రెడ్డి ప్రస్తుతం దుబ్బాక, సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. అంధత్వాన్ని అధిగమించి ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించడం ఆయన పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డా. ఎం. రాజేశ్వర్ రెడ్డిని హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయం ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న జాతీయ విపత్తు నివారణ కమిటీ బృందం





**వరంగల్, 16 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంను జాతీయ విపత్తు నివారణ కమిటీ బృందం దర్శించింది. కమిటీ అధ్యక్షులు గయా ప్రసాద్‌తో పాటు జాయింట్ సెక్రటరీ డా. పొన్ను స్వామి, సభ్యులు బైరి శ్రీనివాసు, ఎస్.ఎస్. పింటో, వనీత, నిశాంత్ మిశ్రా, రాహుల్, శశివర్ధన్ తదితరులు ఆలయానికి విచ్చేశారు. ఆలయానికి వచ్చిన ప్రముఖులకు ఆలయ ఈవో రామల సునీత, ధర్మకర్త తౌనుపునూరి వీరన్నలు, దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహదాశీర్వచనం చేయగా, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్‌డీవో రమేష్ రాథోడ్, తహశీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లి ఏసీపీ సంపత్ రావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అదే రోజు శుక్రవారం కావడంతో వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఫేక్ లింకులను ఓపెన్ చేసి నష్టపోవద్దు : ఎస్సై అనూష హెచ్చరిక

**జన్నారం, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




జన్నారం మండలంలో సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ఫేక్ లింకులు విస్తృతంగా హల్చల్ చేస్తున్నాయని, ప్రజలు వాటిని ఓపెన్ చేసి మోసపోవద్దని గొల్లపల్లి అనూష హెచ్చరించారు. ఈ మేరకు జన్నారం మండల ఎస్సై మాట్లాడుతూ, గుర్తుతెలియని లింకులు ఓపెన్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఫేక్ లింకుల ద్వారా మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే అవకాశం ఉండటంతో పాటు, వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. ముఖ్యంగా బహుమతులు, లోన్లు, సబ్సిడీలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే లింకుల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద లింకులు, కాల్స్ లేదా సందేశాలు వచ్చినట్లయితే వెంటనే వాటిని నిర్లక్ష్యం చేయాలని, అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అనూష సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాల నుంచి తమను తాము రక్షించుకోవాలని ఆమె కోరారు.

# ములుగు జిల్లాలో మావోయిస్టుల లొంగుబాటు

ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ బట్ ఐపీఎస్ సమక్షంలో ఇద్దరు సిపిఐ (మావోయిస్టు) సభ్యులు సరెండర్



**ములుగు, 16 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ములుగు జిల్లా పోలీసులు, సీ.ఆర్.పీ.ఎఫ్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్లు, అవగాహన కార్యక్రమాల ప్రభావంతో నిషేధిత సిపిఐ (మావోయిస్టు) సంస్థకు చెందిన ఇద్దరు సభ్యులు శుక్రవారం ఏటూరు నాగారంలో లొంగిపోయారు. ఈ లొంగుబాటు కార్యక్రమం మనన్ బట్ సమక్షంలో జరిగింది. ఆదివాసీ ప్రాంతాల్లో శాంతి, భద్రత, అభివృద్ధి లక్ష్యంగా పోలీసులు--సీఆర్.పీ.ఎఫ్ అమలు చేస్తున్న "పోరు కన్నా ఊరు మిన్న -- మన ఊరికి తిరిగి రండి" అనే అవగాహన కార్యక్రమం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలపై అవగాహన కలగడంతో మావోయిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశ్యంతో వీరు స్వచ్ఛందంగా జనజీవన స్రవంతిలో కలిసినట్లు పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారు గతంలో సిపిఐ (మావోయిస్టు) పార్టీలో మద్దేడు ఏరియా కమిటీ, ఆకాష్ టీంలో పార్టీ సభ్యులుగా పనిచేసినట్లు గుర్తించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సరెండర్ పాలసీ ప్రకారం లొంగిపోయిన ఇద్దరికీ రూ.25,000/- చొప్పున పునరావాస ఆర్థిక సహాయంను ఏఎస్పీ మనన్ బట్ ఐపీఎస్ చేతుల మీదుగా అందజేశారు. మావోయిస్టు సంస్థ క్రమంగా బలహీనపడుతున్న నేపథ్యంలో, క్రింది స్థాయి క్యాడర్లు నాయకత్వంపై అసంతృప్తితో రహస్య జీవితం విడిచి కుటుంబాలతో కలిసి సాధారణ జీవితం వైపు మళ్లుతున్నారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. లొంగుబాటు చేసిన వారికి నగదు సహాయం, వైద్య సేవలు, పునరావాసం, ఉపాధి అవకాశాలతో పాటు సమాజంలో తిరిగి స్థిరపడేందుకు పూర్తి మద్దతు అందిస్తామని స్పష్టం చేశారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాల ప్రకారం---కుడియం పాండు అలియాస్ కార్తీక్ (23), తండ్రి భీమా, ఎస్టీ గొత్తికోయ, బంధిపార గ్రామం, అంగనిపల్లి పంచాయతీ, మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధి, బీజాపూర్ జిల్లా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కాగా, మద్దేడు ఏరియా కమిటీలో పార్టీ సభ్యుడిగా పనిచేశాడు. మరో వ్యక్తి ముచకి మంగళ్ (25), తండ్రి జోగా, ఎస్టీ గొత్తికోయ, పెద్దభట్టిగూడెం గ్రామం, టెర్రమ్ పోలీస్ స్టేషన్ పరిధి, బీజాపూర్ జిల్లా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవాడు కాగా, సిపిఐ (మావోయిస్టు) 2వ సీ.ఆర్.సిలో పార్టీ సభ్యుడిగా పనిచేశాడు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పీ.ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రశస్త్, వెంకటాపురం సీఐ రమేష్, వాజేడు ఎస్సై సతీష్, వెంకటాపూర్ ఎస్సై తిరుపతి తదితర అధికారులు పాల్గొన్నారు. మావోయిజం మార్గాన్ని విడిచిపెట్టి శాంతి, అభివృద్ధి దిశగా అడుగులు వేసిన ఈ లొంగుబాట్లు ములుగు జిల్లాలో శాంతి--భద్రతలకు మరింత బలం చేకూరుస్తాయని పోలీసు వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు



**మడికొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు కారణమవుతున్న అక్రమ పార్కింగ్, రహదారి అడ్డంకులు, నియమాలు అతిక్రమించే వాహనాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా రహదారిపై అనధికారంగా నిలిపిన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలు రహదారి నిబంధనలు పాటించేలా హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైన చోట జేసీబీ సహాయంతో అడ్డంకులను తొలగించారు. ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వల్ల ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు చేపట్టిన ఈ చర్యలతో స్థానికంగా ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గినట్లు ప్రజలు తెలిపారు.

# కాన్సాస్ సెనేట్ లో కేఏ పాల్ ప్రత్యేక ప్రసంగం

**అమెరికా, జై భీమ్ న్యూస్**

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలన్నీ వెంటనే ఆగిపోవాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 58 ప్రధాన యుద్ధాలు జరుగుతున్నాయని, వీటి వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, ట్రిలియన్ల డాలర్లు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్ (అసెంబ్లీ)లో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలను శాశ్వతంగా నిర్మూలించడంతోనే శాంతి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని పాల్ అన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇరు దేశాలు కలిసి నాయకత్వం వహించాలని చెప్పారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో భారత్, అమెరికాలు కీలక పాత్ర పోషించగలవని అన్నారు.

# భారీ వర్షాలతో జిల్లాల్లో వాటిల్లిన నష్టంపై కేంద్రానికి నివేదిక అందజేస్తాం





హనుమకొండ-వరంగల్ జిల్లాల్లో వరద నష్టాలపై క్షేత్రస్థాయి పర్యటన చేసిన కేంద్ర బృందం

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ గయా ప్రసాద్

**హన్మకొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మొంథా తుపాన్ ప్రభావంతో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా పంటలు, ఆస్తులు, మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని కేంద్ర అధికారుల బృందానికి నేతృత్వం వహించిన గయా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది మంది సభ్యులతో కూడిన రెండు బృందాలుగా విభజించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించింది. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశానికి ముందు ఐడీఓసీ భవనంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం తిలకించింది. భారీ వర్షాల కారణంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలతో పాటు గ్రేటర్ వరంగల్ నగరంలో పంటలు, ఆస్తులు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలకు జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేసిన పర్యటనలు, పునరుద్ధరణ పనుల వివరాలను ఫోటోల రూపంలో ప్రదర్శించారు. ఈ వివరాలను స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హనుమకొండ, వరంగల్ జిల్లాలు, గ్రేటర్ వరంగల్ పరిధిలో నమోదైన వర్షపాతం, వరి సహా ఇతర పంటలకు జరిగిన నష్టం, ప్రాణనష్టం, రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతులకు జరిగిన నష్టాలపై సమగ్ర వివరాలు సమర్పించారు. వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ, మరమ్మతు పనులు, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయం గురించి కలెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో 229.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నష్టం సర్వే పూర్తిచేశామని తెలిపారు. 41 కాలనీల్లో బాధితులను గుర్తించి, ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.15 వేల చొప్పున మొత్తం రూ.5 కోట్ల 23 లక్షల 95 వేల ఎక్స్‌గ్రేషియా నేరుగా అందించామని చెప్పారు. వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను ఆరు పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసరాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టామని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల సహకారంతో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం, భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీ, కొప్పూరు, జీడబ్ల్యుఎంసీ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువు, అమరావతి నగర్ ప్రాంతాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు, స్థానికులతో మాట్లాడిందని తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల జిల్లాలో పంటలు, రహదారులు, భవనాలు, విద్యుత్ వ్యవస్థలకు భారీ నష్టం జరిగిందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని, జిల్లాలో మొత్తం రూ.181.54 కోట్ల నష్టం జరిగినట్లు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వరదలతో పంట నష్టం, రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులు, పాఠశాలలు, విద్యుత్ స్తంభాలు, నీటి పారుదల వనరులు, గృహాలు, పశుసంపదకు జరిగిన నష్టాలను వివరించారు. వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చాహత్ వాజ్పాయ్ మాట్లాడుతూ---గ్రేటర్ వరంగల్ పరిధిలో భారీ వర్షాల కారణంగా మూడు ప్రధాన చెరువుల నుంచి వరద నీరు నగరంలోకి ప్రవేశించడంతో 78 కాలనీలు జలమయమయ్యాయని, 1,560 మంది బాధితులను 45 పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసరాలు అందించామని తెలిపారు. నగరంలో ఎనిమిది ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లకు అంతరాయం కలిగిందని, చేపట్టిన సహాయక చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. సమీక్ష అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ గయా ప్రసాద్ మాట్లాడుతూ---హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పంటలు, ఆస్తులు, ప్రాణ నష్టాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం వ్యవసాయ, విద్యుత్, ఇతర శాఖల అధికారులతో కేంద్ర బృందం సభ్యులు చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో రవి, ధార కవిత, రెవెన్యూ అధికారులు వై.వి. గణేష్, విజయలక్ష్మి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సుమతో పాటు రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, పశుసంవర్ధక, విద్య, హార్టికల్చర్, జీడబ్ల్యుఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు విద్యుత్ ఏర్పాట్లు దాదాపు పూర్తి





భద్రతకు తొలి సారిగా కవర్డ్ కండక్టర్ వినియోగం

**మేడారం, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులు దాదాపు పూర్తయ్యాయని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ (ఎన్.పీ డీసీఎల్ ) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం 18న మేడారంలో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన మేడారం జాతర ప్రాంతంలో కొనసాగుతున్న విద్యుత్ పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. విద్యుత్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా మొట్టమొదటి సారిగా కవర్డ్ కండక్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ లైన్లు 26 కిలోమీటర్లు, 33 కేవీ లైన్లు 11 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. అలాగే ఆరు టవర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, జంపన్న వాగు ఇరువైపులా ఉన్న విద్యుత్ లైన్లకు సేఫ్టీ గార్డింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జాతర అవసరాల కోసం ఇప్పటివరకు వివిధ సామర్థ్యాలున్న సుమారు 200 ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ట్రాన్స్ఫార్మర్లకు సేఫ్టీ మీటర్లు, ఏఎంఆర్‌లను అమర్చి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం లోడ్‌ను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరాన్ని బట్టి మరిన్ని ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు పనులు కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పనులన్నీ పూర్తయ్యాయని, కన్నెపల్లి అమ్మవారి దేవాలయం వద్ద లైన్లను స్వయంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. అన్ని ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ పూర్తి చేయాలని, ఎల్టీ లైన్లలో స్పేసర్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాతర సమయంలో ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. దాదాపు 350 మంది సిబ్బంది జాతర విధుల్లో పాల్గొంటున్నారని, ఏజెన్సీల సిబ్బంది కూడా ఇందులో భాగమని తెలిపారు. అందరికీ డ్యూటీ చార్టులు కేటాయించినట్లు చెప్పారు. జాతర కోసం కొత్తగా నిర్మిస్తున్న 33/11 కేవీ నార్లాపూర్ సబ్‌స్టేషన్‌లో మిగిలిన పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సమ్మక్క--సారలమ్మ జాతరను విజయవంతం చేయడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి. మోహన్ రావు, చీఫ్ ఇంజనీర్ కె. రాజు చౌహాన్, ములుగు ఎస్ఈ ఆనందం, భూపాలపల్లి ఎస్ఈ మల్చూరు, డీఈ ములుగు పి. నాగేశ్వరరావు, డీఈ ఎంఆర్.టి, కన్‌స్ట్రక్షన్ సదానందం, డీఈ టెక్నికల్ భాస్కర్, ఈఈ సివిల్ వెంకట్‌రామ్, ఏడీఈలు రాజేష్, వేణుగోపాల్, సందీప్ పాటిల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నల్గొండలో రాళ్లతో కొట్టి వ్యక్తి హత్య

హత్యకు దారి తీసిన కార్మికుల ఘర్షణ

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికుల మధ్య ఘర్షణ

రాళ్ల దాడిలో మరో ఇద్దరికి గాయాలు

**నల్గొండ, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కార్మికుల మధ్య తలెత్తిన ఘర్షణ తీవ్రరూపం దాల్చి ఒక వ్యక్తి హత్యకు దారితీసింది. నల్గొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన సంభవించింది. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికుల మధ్య వివాదం తలెత్తడంతో పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో నాగర్‌కర్నూలు జిల్లా, తెలకపల్లికి చెందిన చంద్రు అనే వ్యక్తి మృతి చెందాడు. చంద్రు సోదరుడితో పాటు మరో వ్యక్తికి గాయాలు కావడంతో వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చంద్రు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నల్గొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వెంట పడిన కోతులు.. బావిలో పడిన యువకుడు

**ఉత్కంఠభరితంగా సాగిన రక్షణ చర్యలు**

**వర్ధన్నపేట, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారులో జరిగిన ఓ ప్రమాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళు తున్న నూనవన్ విక్రమ్ అనే యువకుడు, అకస్మాత్తుగా కోతులు వెంటపడటంతో బైక్‌పై నియంత్రణ కోల్పోయి రోడ్డుపక్కన ఉన్న బావిలో పడిపోయాడు. ఈ ఘటనతో అక్కడున్నవారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. బావి లోతుగా ఉండటంతో పాటు చుట్టూ మట్టి జారిపడే పరిస్థితి ఉండటంతో రక్షణ చర్యలు కొంత సేపు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. భద్రతా తాళ్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది బావిలోకి దిగిపోయి యువకుడిని జాగ్రత్తగా పైకి తీసుకొచ్చారు. బావి నుంచి బయటకు తీసిన అనంతరం యువకుడికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల నుంచి యువకుడు తప్పించుకున్నాడని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల వర్ధన్నపేట పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వాహనదారులను వెంటపడటం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే రోడ్డుపక్కన మూతలు లేని బావులు ప్రమాదాలకు కారణమవుతున్నాయని, భద్రతా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు, ప్రజలు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. ముఖ్యంగా గ్రామ శివారుల్లో వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



# నాచారంలో మద్యం మత్తులో అన్నను హతమార్చిన తమ్ముడు



**హైద్రాబాద్, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని నాచారం పరిధిలో అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర ఘటనలో తమ్ముడు అన్నను హత్య చేసిన ఘటన కలకలం రేపింది. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవిస్తున్న సమయంలో గ్లాస్ విషయమై అన్నా--తమ్ముళ్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాటల తూటాలు ఘర్షణగా మారడంతో ఆగ్రహానికి గురైన తమ్ముడు అన్నను మూడంతస్తుల భవనం పై నుంచి తోసేయగా, కింద పడిన అతడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనలో నిందితుడైన తమ్ముడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తెనాలిలో 158 వంటకాల రికార్డును మించిపోయేలా...

**విశాఖలో 290 వంటకాలతో అల్లుడికి విందు**
**నర్సీపట్నంలో కొత్త అల్లుడికి అత్తమామల ఘన స్వాగతం**
**తొలి సంక్రాంతికి ఏకంగా 290 రకాల పిండి వంటలతో విందు**
**అల్లుడి వయసు 29 ఏళ్లు కావడంతో పక్కన సున్నా చేర్చి 290 ఐటమ్స్ ఏర్పాటు**
**వంటకాలను చూసి ఆశ్చర్యానికి గురైన కొత్త అల్లుడు శ్రీహర్ష**



**విశాఖపట్నం, జై భీమ్ న్యూస్**

గోదారోళ్ల ఆతిథ్యం అంటే ఎలా ఉంటుందో నర్సీపట్నంకు చెందిన ఓ జంట రుచి చూపించింది. తమ కొత్త అల్లుడికి తొలి సంక్రాంతి పండుగ సందర్భంగా ఏకంగా 290 రకాల పిండి వంటలతో భారీ విందు ఏర్పాటు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ అరుదైన ఆతిథ్యం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. నర్సీపట్నం మున్సిపాలిటీలోని శాంతి నగర్‌లో నివసించే నాళం రమేశ్ కుమార్, కళావతి దంపతులు తమ కుమార్తె లక్ష్మీ నవ్యను శ్రీహర్షకు ఇచ్చి ఇటీవల వివాహం జరిపించారు. కొత్త అల్లుడు శ్రీహర్ష (29)కు ఇది తొలి సంక్రాంతి కావడంతో పండగను ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనుకున్నారు. ఇందులో భాగంగా, అల్లుడి వయసు 29కి పక్కన 'సున్నా' చేర్చి ఏకంగా 290 రకాల వంటకాలను సిద్ధం చేశారు. ఇవాళ భోజనానికి వచ్చిన అల్లుడు శ్రీహర్ష, తన కోసం సిద్ధం చేసిన వంటకాలను చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. తన కళ్ల ముందు కనిపిస్తున్న వందల రకాల ఐటమ్స్‌ను చూసి విస్మయానికి గురయ్యాడు. ఈ సంక్రాంతికే గుంటూరు జిల్లా తెనాలిలో ఓ అల్లుడికి 158 రకాలతో విందు ఏర్పాటు చేయడం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ సంఖ్యను మించిపోయేలా నర్సీపట్నం దంపతులు 290 వంటకాలతో విందు ఇచ్చి తమ అల్లుడిపై ఉన్న ప్రేమను చాటుకోవడం విశేషం.

# ఈ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం యావత్ తెలంగాణకు గర్వకారణం: కేటీఆర్

**టీఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించిందన్న కేటీఆర్**
**ఈ విధానం ద్వారా రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి**
**పదేళ్లలో 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని స్పష్టీకరణ**
**కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతకొద్దని ప్రత్యర్థులకు హితవు**
**రైతుబంధు, మిషన్ భగీరథలాగే టీఎస్ ఐపాస్‌కు జాతీయ గుర్తింపు లభించిందని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన టీఎస్ ఐపాస్ (టూ-ఊూూూ) విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేసీఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని కేటీఆర్ గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (మీవీజు) విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు. గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ-హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి చిన్న పరిశ్రమల వరకు తెలంగాణ వైపు చూసేలా పెట్టుబడిదారుల్లో ఈ విధానం కొండంత విశ్వాసాన్ని నింపిందన్నారు. "ఇకనైనా కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిది" అని పరోక్షంగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ చెప్పిన తర్వాత కూడా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

# ప్రారంభమైన సంక్రాంతి తిరుగు ప్రయాణాలు

**ఏపీలో ప్రధాన బస్టాండ్లలో పెరిగిన రద్దీ**
**ముగిసిన మూడు రోజుల సంక్రాంతి సంబరాలు**
**సొంతూళ్ల నుంచి నగరాలకు ప్రజల తిరుగు ప్రయాణం**
**ఏపీ వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిట**
**రద్దీని తగ్గించేందుకు ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు**
**సోమవారం వరకు ప్రయాణికుల రద్దీ కొనసాగే అవకాశం**


**విజయవాడ, జై భీమ్ న్యూస్**

మూడు రోజుల పాటు అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు శుక్రవారం కనుమ పండుగతో ఘనంగా ముగిశాయి. పండుగ కోసం సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరిగి నగరాలకు పయనమవుతుండడంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. భోగి మంటలతో ప్రారంభమైన వేడుకల కోసం ఉద్యోగ, వ్యాపార, విద్యా అవసరాల రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో స్థిరపడిన వారంతా పల్లెలకు, పట్నాలకు చేరుకున్నారు. బంధుమిత్రుల రాకతో ఇన్నాళ్లూ కళకళలాడిన పల్లెలు ఈ సాయంత్రం నుంచి క్రమంగా ఖాళీ అవుతున్నాయి. పండుగ సెలవులు ముగియడంతో అందరూ తిరుగు ప్రయాణాలు కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ప్రధాన నగరాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో సీట్లన్నీ ముందుగానే రిజర్వ్ అయిపోయాయి. రైళ్లలోనూ సాధారణ బోగీల నుంచి రిజర్వేషన్ బోగీల వరకు ఎక్కడా ఖాళీ కనిపించడం లేదు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కూడా పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ రద్దీ సోమవారం వరకు కొనసాగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ కు సెల్యూట్ చేస్తున్నానంటూ బాలీవుడ్ హీరో ట్వీట్... స్పందించిన పవన్

**పవన్ కల్యాణ్‌ను గ్రాండ్‌మాస్టర్ అంటూ కొనియాడిన విద్యుత్ జమ్వాల్**
**బాలీవుడ్ హీరో ప్రశంసలకు స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**
**ఇద్దరు మార్షల్ ఆర్ట్స్ కళాకారుల మధ్య ఆసక్తికర సంభాషణ**
**కళరిపయట్టును ప్రోత్సహిస్తున్న విద్యుత్‌ను అభినందించిన పవన్**

**అమరావతి, జై భీమ్ న్యూస్**




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌పై బాలీవుడ్ యాక్షన్ హీరో విద్యుత్ జమ్వాల్ ప్రశంసల వర్షం కురిపించారు. మార్షల్ ఆర్ట్స్‌లో పవన్ నైపుణ్యాన్ని కొనియాడుతూ ఆయన్ను 'గ్రాండ్‌మాస్టర్ణ అని సంబోధించారు. దీనిపై పవన్ కల్యాణ్ కూడా అంతే హుందాగా స్పందించారు. వీరిద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన ఈ సంభాషణ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. "మాస్టర్ పవన్ కల్యాణ్, గ్రాండ్‌మాస్టర్‌గా మీ ఉన్నతికి నా సెల్యూట్. మీ ప్రయాణం ఎందరికో స్ఫూర్తినిస్తూ క్రమశిక్షణ, యోధ స్ఫూర్తిని అందిస్తోంది" అని విద్యుత్ జమ్వాల్ తన పోస్టులో పేర్కొన్నారు. విద్యుత్ కూడా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యుడు కావడంతో ఆయన అభినందనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ప్రశంసలకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలుపుతూ స్పందించారు. "డియర్ విద్యుత్ జమ్వాల్, మీ ఉదారమైన మాటలకు ధన్యవాదాలు. మార్షల్ ఆర్ట్స్‌కు కట్టుబడి ఉన్న మీలాంటి వారి నుంచి ఈ మాటలు రావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. మన సంప్రదాయ యుద్ధ కళ కళరిపయట్టును ప్రోత్సహించడానికి మీరు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకం. క్రమశిక్షణ, వారసత్వం, యోధ స్ఫూర్తిని గౌరవించడానికి సినిమాను ఇంత నిజాయతీగా ఉపయోగించడం అభినందనీయం. మీ తదుపరి ప్రాజెక్టులకు శుభాకాంక్షలు" అని పవన్ బదులిచ్చారు.

# 'ఏపీ ఫస్ట్... తిరుపతిలో అతి పెద్ద రీసెర్చ్ సెంటర్

**సీఎం చంద్రబాబు ప్రకటన**
**తిరుపతిలో 'ఏపీ ఫస్ట పేరుతో భారీ పరిశోధన కేంద్రం**
**ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్**
**భవిష్యత్ టెక్నాలజీ రంగాల్లో యువతకు నైపుణ్యం అందించడమే లక్ష్యం**
**రాష్ట్రంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశం**
**వ్యవసాయం, వైద్యంలో డ్రోన్ల వినియోగం పెంచాలని సూచన**

**తిరుపతి, జై భీమ్ న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (ఊాా ఫీ×=ూు) పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (××ు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (××ూజు=) భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు. "డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ణ వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem




# 'మన శంకర వరప్రసాద్ గారు' నాలుగు రోజుల కలెక్షన్లు

**సంక్రాంతికి మరో హిట్ కొట్టిన మెగాస్టార్**
**అద్భుత విజయం దిశగా 'మన శంకర వరప్రసాద్ గారు'**
**నాలుగు రోజుల్లో రూ. 190 కోట్ల గ్రాస్ కలెక్షన్లు**

మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' అద్భుతమైన విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ సినిమాతో చిరంజీవి తన స్టార్‌డమ్‌కు తగ్గ మరో బిగ్ హిట్ కొట్టారు. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం, విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ. 190 కోట్ల గ్రాస్ కలెక్షన్లను దాటడం విశేషం. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్--కామెడీ ఎంటర్‌టైనర్‌లో నయనతార కథానాయిక కాగా... విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటించారు. కథ, వినోదం, భావోద్వేగాలు అన్నీ సమపాళ్లలో కలగలిసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తొలి షో నుంచే పాజిటివ్ రివ్యూలు రావడంతో కలెక్షన్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ రోజు ముగిసేలోపే రూ.200 కోట్ల మార్క్‌ను కూడా ఈ చిత్రం అందుకుంటుందని అంచనాలు వెలువడుతున్నాయి. సంక్రాంతి సెలవుల్లో కుటుంబ ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలివస్తుండటం సినిమాకు అదనపు బలంగా మారింది.

# దేవి శ్రీ ప్రసాద్ హీరోగా 'ఎల్లమ్మ'... గ్లింప్స్ ఇదిగో!

**'బలగం' దర్శకుడు వేణు యెల్దండి దర్శకత్వంలో 'ఎల్లమ్మ' చిత్రం**
**హీరోగా సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అరంగేట్రం**
**'పర్షి' అనే పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించిన డీఎస్పీ**
**సంక్రాంతి సందర్భంగా కాన్సెప్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసిన దిల్ రాజు**
**పాన్-ఇండియా స్థాయిలో సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు**




ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ (డీఎస్పీ) హీరోగా అరంగేట్రం చేయబోతున్నారు. 'బలగం' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎల్లమ్మ' సినిమాలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం ఈ చిత్ర కాన్సెప్ట్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో 'పర్షి' అనే పాత్రలో దేవిశ్రీ ప్రసాద్‌ను పరిచయం చేశారు. పొడవాటి జుట్టు, గడ్డంతో, ఒంటిపై చొక్కా లేకుండా డప్పు వాయిస్తూ డీఎస్పీ సరికొత్త అవతారంలో కనిపించారు. గాలికి తిరుగుతున్న వేపాకు, తుపాను, మేక... ఆధ్యాత్మిక, జానపద అంశాలతో కూడిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం జానపద నేపథ్యంతో కూడిన ఒక మ్యూజికల్ సోషల్ డ్రామాగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు డీఎస్పీనే సంగీతం అందిస్తుండగా, టీ-సిరీస్ సంస్థ మ్యూజిక్ హక్కులను సొంతం చేసుకుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా చిత్రంగా 'ఎల్లమ్మ'ను విడుదల చేయనున్నారు. గతంలో ఈ ప్రాజెక్టులో వేరే హీరోల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి డీఎస్పీనే ఖరారయ్యారు. త్వరలోనే మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ప్రకటించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# నటి అనసూయ ఫిర్యాదు.. 42 మందిపై కేసు నమోదు

**తనపై ఆన్‌లైన్ వేధింపులపై అనసూయ ఫిర్యాదు**
**అసభ్యకర వీడియోలు సృష్టిస్తున్నారన్న అనసూయ**
**జాబితాలో సినీ నిర్మాతలు, జర్నలిస్టులు**

టాలీవుడ్‌లో తనదైన గుర్తింపుతో నటిగా, యాంకర్‌గా కొనసాగుతున్న అనసూయ భరద్వాజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె సినిమాలు లేదా టీవీ కార్యక్రమాల కారణంగా కాదు... తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులు, అసభ్యకర ప్రచారానికి వ్యతిరేకంగా చట్టపరమైన పోరాటానికి దిగినందుకు. సోషల్ మీడియాలో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా జరుగుతున్న దాడులను ఇక సహించబోనంటూ అనసూయ గట్టిగా నిర్ణయం తీసుకున్నారు. తనపై జరుగుతున్న వేధింపులు కేవలం విమర్శల వరకే పరిమితం కాలేదని, ఏఐ టెక్నాలజీని ఉపయోగించి మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకర వీడియోలు సృష్టించి వైరల్ చేస్తున్నారని అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో ఆమె ఫిర్యాదు చేయగా... సైబర్ క్రైమ్ పోలీసులు 42 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ జాబితాలో సినీ నిర్మాతలు, జర్నలిస్టులు, టీవీ ఛానెళ్ల యాంకర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఉండటం గమనార్హం. తన ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో అసభ్య పదజాలం వాడటం, లైంగిక బెదిరింపులు చేయడం, తన భద్రతకు ముప్పు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం, ప్రజా జీవితంలో తన జీవనోపాధిపై ప్రభావం చూపేలా ప్రవర్తించడం వంటి అంశాలను ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని కఠినమైన సెక్షన్లతో పాటు ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. దీనీా సెక్షన్లు 75, 79, 336(4), 351, 356 అలాగే ఐటీ చట్టంలోని 66-ఇ, 67 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వివాదంపై సింగర్ చిన్మయి శ్రీపాద కూడా స్పందించారు. ఎక్స్ వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. అనసూయను వేధించిన వారిలో రాజకీయ నాయకులు కూడా ఉన్నారని, ముఖ్యంగా కాంగ్రెస్ నాయకురాలు బొజ్జ సంధ్యా రెడ్డితో పాటు కొంతమంది న్యూస్ యాంకర్లు అనసూయను కించపరిచేలా వ్యవహరించారని చిన్మయి ఆరోపించారు. మహిళల రక్షణపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి ఆలోచనలు కలిగిన వారిని పార్టీలో కొనసాగించకూడదని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఆమె కోరారు.